

అభివృద్ధే జగనన్న అజెండా

సంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. - 8లో



సాదర స్వాగతం

రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌కు ఘన స్వాగతం లభించింది. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
తిరుపతి	6-27	4-52
గూడూరు	6-22	4-49

న్యూస్‌రీల్

తిరుమలలో రామ్‌చరణ్



తిరుమలకు చేరుకున్న సినీ నటుడు రామ్‌చరణ్

తిరుమల: ప్రముఖ సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. బుధవారం ఆయన స్వామి వారిని దర్శించుకోనున్నారు.

సైన్స్ పరీక్షకు 551మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం తిరుపతి జిల్లా వ్యాప్తంగా 162 పరీక్షా కేంద్రాల్లో బయోలాజికల్ సైన్స్ పరీక్ష జరిగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 26,972 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా వారిలో 551మంది గైర్హాజరైనట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. అలాగే ఈ పరీక్షకు ప్రైవేటు విద్యార్థులు 2,844 మంది హాజరవ్వాల్సి ఉండగా వారిలో 1,206 మంది గైర్హాజరైనట్టు చెప్పారు. పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు సోషల్ స్టడీస్ సబ్జెక్టు పరీక్ష జరుగుతుందని డీఈఓ తెలిపారు.

వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం



తిరుపతి అర్బన్: రాష్ట్రంలో సాధారణ ఎన్నికల పోలింగ్ మే 13న జరగనున్న నేపథ్యంలో 13,250 మంది వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు ఎన్నికల డ్యూటీలకు ఎంపిక చేశారు. ఓటింగ్ శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల కమిషన్ 33 అత్యవసర శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును సద్వినియోగం చేసుకునే అవకాశం కల్పించింది. పోలింగ్ రోజు వార్తాల సేకరణలో ఉండే విలేకరులకు సైతం ఈ అవకాశాన్ని కల్పించింది. దీంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎన్నికల సంఘం జారీ చేసిన అథరైజేషన్ లెటర్ ఉండాలి. అంతేకాకుండా పోలింగ్ రోజు ఓటు వేయలేని వారి కోసం ఫారం 12డీని అందుబాటులో ఉంచారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం జిల్లాలో ప్రత్యేకించి ఒక నోడల్ అధికారిని నియమించారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది

సాంకేతిక పురోగతికి కంప్యూటర్ సైన్స్ అవసరం



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: సాంకేతిక పురోగతికి, భాషాభివృద్ధికి కంప్యూటర్ సైన్స్ చాలా అవసరమని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ట్రెండ్స్ అండ్ టెక్నాలజీస్ టు సాంస్కృట్ అండ్ కంప్యూటర్‌సైన్స్' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. కంప్యూటర్ సైన్స్‌తో ఆధునిక తరానికి ఆధునిక పద్ధతుల ద్వారా సంస్కృతాన్ని అందించవచ్చన్నారు. ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ బీ.వెంకటరమణ, రిజిస్ట్రార్ రమాశ్రీ, కన్వీనర్ బీ.చంద్రశేఖరం, ఎమ్.మేరీసుజాత పాల్గొన్నారు.

తాత నోట.. మళ్లీ పాత పాట!



ఎక్కడ సింగపూరు.. ఎక్కడ కుప్పం.. బెంగళూరు అభివృద్ధి ఎక్కడ.. కుప్పంలో అభివృద్ధి ఎంత..? ఇవి విపక్ష నేత చంద్రబాబుకు తెలియంది కాదు.. ఓట్ల వేటలో నోటికొచ్చిన హామీలు గుప్పించి అమాయక కుప్పం ప్రజలను బురిడీ కొట్టించడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. 35 ఏళ్లుగా వారిని మభ్యపెట్టిన బాబు ఇప్పుడూ అదేపాట అందుకున్నారు. 'కుప్పాన్ని మరో సింగపూర్ చేస్తా.. బెంగళూరు జనం చదువు, పనుల కోసం కుప్పానికి వచ్చేటట్లు మారుస్తా..' నంటూ అలవిగాని హామీలు గుప్పించేశారు. రెండు రోజులుగా తన రాజకీయ అనుభవాన్నంతా రంగరించి హామీల వర్షంలో కుప్పం ప్రజలను తడిపి ముద్దచేశారు. వీటి అమలు ఎంత.. బాబు హామీల్లో నిజం ఎంత అని స్థానికులు చర్చించుకుంటున్నారు. సంక్షేమ ప్రభుత్వం నీడన ఉన్న చల్లదనం.. సైకిలు ఎక్కితే వచ్చిందా..? అని చర్చించుకుంటున్నారు. బాబు హామీలు.. వాటి విధివిధానాలపై జనం చర్చించుకుంటున్నారు.

- మళ్లీ అలవిగాని హామీలు గుప్పించిన చంద్రబాబు నాయుడు
- ప్రతి ఎన్నికల ముందే ఇవే గొప్పలు
- 35 ఏళ్లుగా అదే తంతు
- అధికారంలో ఉన్నప్పుడు ఒక్కటీ పట్టించుకోని తాత
- బాబు హామీలపై నిలదీస్తున్న కుప్పం ప్రజలు
- గత, ప్రస్తుత ప్రభుత్వాల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్న స్థానికులు

కుప్పం/కుప్పంరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండు రోజుల పాటు అలవిగాని హామీలు గుప్పించారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్ల సీఎం హోదా ఉన్నప్పుడు కుప్పాన్ని అభివృద్ధి చేయని తాత మరో అవకాశం ఇస్తే చేస్తానంటూ జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఈసారి అయితే మరో అడుగు ముందుకేసి బెంగళూరు జనం కుప్పం వచ్చేలా చేస్తానంటూ అమలుకు యోగ్యం కాని హామీలు గుప్పించి స్థానికులకు విసుగు తెప్పించారు. ఆయన హామీలపై మీరే ఓ లుక్కేయండి..!

రికార్డు అరిగిపోయింది బాబూ!

- కుప్పాన్ని దేశానికే ఆదర్శం చేస్తా
- పారిశ్రామికవాడ చేసి యువకులకు ఉపాధి కల్పిస్తా
- కుప్పం పట్టణాన్ని శాటిలైట్ సిటీ చేసి, ప్రతి పంచాయతీకి కోటి, మేజర్ పంచాయతీకి రెండు కోట్ల నిధులు కేటాయిస్తా.
- గ్రామాల్లో అభివృద్ధి పనులు స్థానికులే చేసుకునే విధంగా అవకాశం
- ప్రతి గ్రామానికీ రోడ్డు, ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయితో పాటు పొలాలకు సిమెంట్ రోడ్లు వేయిస్తా
- కుప్పాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు బెంగళూరుకు ఫోర్‌వే రోడ్డుతో పాటు ప్రత్యేక విమానాశ్రయం ఏర్పాటు చేస్తా
- కుప్పంలో ప్రతి ఎకరాకు బిందుసేద్యం పరికరాలు ఇచ్చి వ్యవసాయ హబ్‌గా తయారు చేస్తా
- శాశ్వత తాగు, సాగునీటికి హంద్రీ-నీవా జలాలు తీసుకువస్తా
- ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలను అనుసంధానం చేస్తా.
- ప్రతి మహిళకు నాలుగు ఆవులు ఇచ్చి పాడి పరిశ్రమతో స్వయం ఉపాధి కల్పిస్తా

గతంలో ఇచ్చిన హామీలు గుర్తున్నాయా బాబూ?

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చే వరకు కుప్పంలో కనీసం డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేయని బాబు చదువుల హబ్‌గా ఎలా మారుస్తారని స్థానికులు నిలదీస్తున్నారు.
- పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి టెండర్లు పిలిస్తే తమిళనాడు ప్రభుత్వంతో కలిసి కోర్టులకు వెళ్లింది చంద్రబాబు కాదా..? అని కుప్పం ప్రజలు గళమెత్తుతున్నారు.
- గతంలో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు ఇంజినీరింగ్ కళాశాలతో అనుసంధానం చేస్తామంటే ఎలా నమ్మేదని ధ్వజమెత్తుతున్నారు.
- 2004లో కుప్పాన్ని మరో సింగపూర్ చేస్తామన్న హామీ ఇచ్చి, ఆపై సీఎం హోదాలో మరిచిపోయిన సంగతి గుర్తులేదా..? అంటున్నారు.
- 2001లో పారిశ్రామిక వాడ కోసం అనిమిగానిపల్లి వద్ద శంకుస్థాపన చేసి.. ఇప్పుడు యువతకు ఉద్యోగాలిస్తామనడం తప్పు కాదా అని ప్రశ్నిస్తున్నారు.
- 2018లో ఎయిర్‌పోర్ట్ కోసం శంకుస్థాపన చేసి ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయింది నువ్వు కాదా అని మండిపడుతున్నారు.
- అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు గొప్పలు చెప్పి మరో అవకాశం ఇవ్వాలంటూ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు.

మా నమ్మకం నువ్వే జగన్

నమ్మకానికి మారుపేరు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కుప్పం ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుప్పం పట్టణాన్ని అప్‌గ్రేడ్ చేసి మున్సిపాలిటీ హోదా కల్పించారని గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అలాగే కుప్పాన్ని రెవెన్యూ, పోలీసు డివిజన్లుగా తీర్చిదిద్దారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం అభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని నినదిస్తున్నారు. కలగా మారిన హంద్రీ-నీవాను పూర్తిచేసి కుప్పానికి నీళ్లిచ్చిన ఘనత జగనన్నదని నమ్ముతున్నారు. అదేవిధంగా పాలారు ప్రాజెక్టు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణానికి అడుగులు వేయడం అభివృద్ధికి సంకేతమని చెబుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం, కమ్యూనిటీ భవనాల నిర్మాణం ఎవరి హయాంలో పూర్తయ్యాయో బాబు చెప్పాలని నిలదీస్తున్నారు. మరోమారు జగనన్నను గెలిపించుకుంటే కుప్పం రూపురేఖలు మారడం ఖాయమని గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఈ సారి కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ముక్తకంఠంతో హోరెత్తిస్తున్నారు.

కుప్పంకు బాబు చేసిందేమీ లేదు



చంద్రబాబు కుప్పం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయినా ఆయన చేసింది ఏమీ లేదు. కనీసం కుప్పంలో డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేయలేదు. పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చి డిగ్రీ కళాశాల పెడితే, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణంలో అండర్ బ్రిడ్జీల నిర్మాణం పూర్తిచేశారు. కుప్పంలో శాశ్వత అభివృద్ధి జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందే. ఆయన వస్తే కుప్పం రూపురేఖలు మారతాయని మా నమ్మకం.

– మాధవన్, డీకే పల్లి, కుప్పం మండలం

ఇంతకాలం ఎందుకు చెయ్యలేదు?



ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబు ఇంకో అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానంటున్నారు. 35 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. 3 పర్యాయాలు సీఎంగా ఉండి ఎందుకు చేయలేదు?. కనీసం కుప్పాన్ని మున్సిపాలిటీ కూడా చేయలేకపోయారు. ఆయనను ఇకమీదట ఇక్కడి ప్రజలు నమ్మరు. జగన్‌మోహన్‌రెడ్డి కుప్పానికి చేసిన అభివృద్ధి ఏమిటో జనం ప్రత్యక్షంగా చూశారు. ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పూర్తి చేసి కుప్పానికి నీళ్లిచ్చారు. రెవెన్యూ, పోలీస్ డివిజన్లు ఏర్పాటు చేసి కుప్పం రూపురేఖలే మార్చేశారు. మరోమారు జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

– కుమార్, డీకే పల్లి, కుప్పం మండలం

జగన్ పాలన నచ్చింది.. పలకరింపు గుండెల్ని తాకింది

- చినబాబు పెత్తనం.. సీనియర్లకు అవమానం
- టీడీపీకి 42 ఏళ్ల సేవ చేస్తే.. విలువ లేకుండా చేశారు
- రాజన్న బిడ్డను రెండో సారి ముఖ్యమంత్రిగా చూడాలి
- కిలివేటికి భారీ మెజారిటీ తెప్పించేందుకు కృషి
- వేనాటి రామచంద్రారెడ్డి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు వేనాటి రామచంద్రారెడ్డి

సూళ్లూరుపేట: 42 ఏళ్లు టీడీపీకి సేవచేస్తే కనీసం టిక్కెట్టు ఇచ్చే సమయంలో ఒక్కమాట కూడా చెప్పకుండా విలువ లేకుండా చేసి మనస్తాపానికి గురిచేశారని సూళ్లూరుపేట సీనియర్ నాయకుడు వేనాటి రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తదితరులు వేనాటి రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించి మంగళవారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. జగన్‌మోహన్ రెడ్డి ఆయనను ఆప్యాయంగా పలకరించి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014 నుంచి 2019 దాకా టీడీపీలో తమకు జరిగినన్ని అవమానాలు ఎవరికీ జరగలేదన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీలో చేరాలన్న కోరిక ఇన్నాళ్లకు తీరిందన్నారు. తాను పార్టీలో చేరేందుకు వెళ్లిన సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలకరించి తీరు, మర్యాదపూర్వకమైన పిలుపు తనకు ఎంతో నచ్చిందని, ఇది ఆయన రాజకీయ చతురతకు నిదర్శమన్నారు. రాజకీయాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిని మించిన తనయుడిగా తనదైన శైలితో ముందుకు దూసుకెళ్లడం నచ్చిందన్నారు. టీడీపీలో లోకేష్ పెత్తనం రావడంతో సీనియర్లను పని గట్టుకుని అవమానించి బయటకు వెళ్లేలా చేస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎమ్మెలే అభ్యర్థి కిలివేటి సంజీవయ్యను గతంలో వచ్చిన మెజారిటీ కంటే అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు తనవంతు పాత్ర పోషిస్తానని చెప్పారు. సంక్షేమం అభివృద్ధిని రెండుకళ్లుగా భావిస్తూ రాష్ట్ర ప్రజల్లో హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావడం తథ్యమని చెప్పారు. ఆయన గెలిస్తేనే ఈ రాష్ట్రంలోని పేద ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పారు. తనతో పాటు తన కుమారుడు వేనాటి సుమంత్‌రెడ్డి కూడా పార్టీ గెలుపుకోసం తమవంతు పాత్రను పోషిస్తామని తెలిపారు.

బీసీలకు పెద్దపీట వేస్తున్నది జగనే



మస్తాన్ యాదవ్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని వెంకటగిరి నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ మస్తాన్ యాదవ్ అన్నారు. తాడేపల్లెలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో మంగళవారం ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం డాక్టర్ మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ.. అప్పట్లో ఎన్టీఆర్ బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని టీడీపీలో చేరానన్నారు. బీసీలకు టిక్కెట్లు ఇస్తారని తాను ఆశించాననీ, కానీ తాము కష్టపడినప్పటికీ తమకు చంద్రబాబునాయుడు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా వేరే వారికి సీటు ఇచ్చారని మండిపడ్డారు. చంద్రబాబు చేసే సర్వేలన్నీ ఉత్తుత్తి సర్వేలే అని స్పష్టం చేశారు. డబ్బు మూటలు ఉన్న వారికే టీడీపీలో సీటు ఇచ్చారని అన్నారు. నేడు బీసీలకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి తనకు అండగా ఉంటారని చెప్పారు.

3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 3వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. స్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 5 నుంచి 13వ తేదీ వరకు శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 3వ తేదీన తెల్లవారు జామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించనున్నారు.

దేశ భవిష్యత్తు యువతదే



సమావేశంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, వీసీ, న్యాయాధికారులు

- సమాజంలో న్యాయశాస్త్రానిది కీలక పాత్ర
- న్యాయశాస్త్ర అధ్యయనం సామాజిక బాధ్యత కావాలి
- ఎస్వీయూలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

తిరుపతి సిటీ: 'దేశ భవిష్యత్తు యువతదే. న్యాయశాస్త్ర అధ్యయనం సామాజిక బాధ్యతగా యువత పరిగణించాలి' అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై చంద్రచూడ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సు పదవ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. న్యాయశాస్త్ర అధ్యయనం ప్రజలకు సేవ చేసేందుకు ఉపయోగపడాలన్నారు. దేశంలో యువత డాక్టర్, ఇంజినీరింగ్ కోర్సుల కంటే న్యాయశాస్త్ర పఠనంపై ఆసక్తి చూపడం శుభపరిణామన్నారు. భవిష్యత్‌లో న్యాయమూర్తులుగా రాణించాలనే యువత సమస్యను సావధానంగా వినడం, విషయాన్ని లోతుగా పరిశీలించడం అనే రెండు విషయాలను ప్రధానంగా గుర్తుపెట్టుకోవాలన్నారు. దేశంలో న్యాయవ్యవస్థలో మహిళలు పెద్ద ఎత్తున రాణిస్తున్నారని, సుమారు 50 శాతానికిపైి చిలుకు న్యాయాధికారులుగా, అడ్వకేట్లుగా ఉన్నారని ప్రశంసించారు. ఇక్కడి విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఆకాంక్షించారు.

సీజే యువతకు ఆదర్శం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి యువతకు ఆదర్శమని ఎస్వీయూ వీసీ వీ.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎస్వీయూ నాణ్యమైన విద్య, ఉపాధి కల్పనే లక్ష్యంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. సీజే సూచనలతో యువత మాజ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్వీయూ లా కళాశాల గౌరవ ప్రొఫెసర్లుగా ఆరుగురు న్యాయాధికారులను నియమిస్తూ సీజే చేతుల మీదుగా ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా సీజే దంపతులను వర్సిటీ అధికారులు జ్ఞాపికతో ఘనంగా సన్మానించగా, వర్సిటీ లా విద్యార్థులు వారిని గజమాలతో సత్కరించారు. సీజే సతీమణి కల్పనా దాస్ చంద్రచూడ్, హైకోర్టు జడ్జి యూ.దుర్గాప్రసాద్‌రావు, డిసిగ్నేటెడ్ సుప్రీంకోర్టు అడ్వకేట్ మహాలక్ష్మి పావని, రిజిస్ట్రార్ ఓ.మహ్మద్ హుస్సేన్, ప్రిన్సిపల్ పద్మనాభం, డీన్ ఆచార్య ఆర్‌సీ కృష్ణయ్య, హైకోర్టు న్యాయవాదులు, జిల్లా న్యాయమూర్తులు, అడ్వకేట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,731 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,156 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.40 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 27, 28 తేదీల్లో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో అండర్–11, 14 రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు బాలబాలికలకు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పీ.విజయకుమారి తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి బాలబాలికలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. గెలుపొందిన వారు మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక

- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- ఫ్లయింగ్ స్క్వాడ్‌తో నిరంతర నిఘా
- చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి

తిరుపతి రూరల్: సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్టు తిరుపతి ఆర్డీవో, చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి తెలిపారు. మరికొద్ది రోజుల్లో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు అతిక్రమించకుండా నిరంతర నిఘా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక కేంద్రాలు, హోంబ్యాలెట్ తదితర అంశాలపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

చురుగ్గా ఏర్పాట్లు

ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

అది అపోహ మాత్రమే

చంద్రగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఓటర్లను చేర్పుతున్నారు అనేది అపోహ మాత్రమే. గత ఐదేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల మంది ఓటర్లు కొత్తగా వచ్చారు. ఇది జాతీయ సగటుతో పోల్చితే కూడా తక్కువే. రాష్ట్రంలో 20 నియోజకవర్గల్లో మనకన్నా ఎక్కువగా ఓటర్లు చేరారు. తిరుపతి నగరానికి అనుకుని ఉన్న నియోజకవర్గం కావడంతో ఎక్కువగా వలసలు వచ్చారు. గత ఐదేళ్లలో 30 వేలకు పైగా కొత్త కరెంట్ కనెక్షన్లు వచ్చాయి. దాదాపు 7,500కు పైగా కొత్త ఇంటి పన్నులు నమోదయ్యాయి. ఈనేపథ్యంలో సహజంగానే ఓటర్లు పెరగడం జరుగుతుంది.

నియమావళిపై అవగాహన

ఎన్నికల నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేశాం. నాయకులకు సహజంగా అవగాహన ఉంటుంది. అయినప్పటికీ మా బాధ్యతగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నియమాళిని వివరించాం.

ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోనే చర్యలు

ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటాం. సీ విజిల్ యాప్ ద్వారా ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది ముందుగా జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. అక్కడ్నుంచి మాకు చేరుతుంది. వెంటనే సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటాం. దీనికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లు పనిచేస్తాయి.

ఫిర్యాదు చేసేవారి పేర్లు గోప్యం

యాప్‌లో ఫిర్యాదు చేయడానికి ఎవరూ బయపడాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఉల్లంఘన అయినా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. లేదా నేరుగా నాకు గాని, మా ఎన్‌ఫోర్స్‌మెంట టీమ్‌లకు గాని, ఏఈఆర్వోకు గాని ఫిర్యాదు చేయవచ్చు. లేదా రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. దీని కోసం 9491077012 నెంబర్‌కు లేదా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు చేయవచ్చు. ఫిర్యాదు చేసేవారి పేర్లను, వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

వారు ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ఎన్నికల ప్రచారంలో ఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులెవరూ పాల్గొనకూడదు. పబ్లిక్ సెక్టార్(పీఎస్‌యూ)లలో పనిచేసే ఉద్యోగులు కూడా ప్రచారంలో పాల్గొనకూడదు. ఒకవేళ పాల్గొన్నట్టు ఫిర్యాదులొస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోకతప్పదు. ఇప్పటికే చిన్నగొట్టిగల్లు మండలంలో ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశాం.

నియోజకవర్గంలో 3,12,438 మంది ఓటర్లు

చంద్రగిరి నియోజకవర్గంలో 3,12,438 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,51,659 మంది పురుషులు, మహిళలు 1,60,719 మంది ఉన్నారు. మరో 60 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరంతా మే 13న ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

48 గంటల ముందు అనుమతి తప్పనిసరి

ఎన్నికలకు సంబంధించిన అన్ని అనుమతులు సువిధ యాప్‌లో లభిస్తాయి. వాహనాలకు సంబంధించిన అనుమతులు, పార్టీ కార్యాలయాలు, లౌడ్ స్పీకర్లు, సభలు, సమావేశాలు తదితర అన్ని అనుమతులు ఈ యాప్‌లో లభిస్తాయి. పార్టీలకు సబంధించిన స్టిక్కర్లు మోటారు వాహనాలకు అతికించుకోవాలన్నా అనుమతి కావాల్సిందే. కార్లతో పాటు బైక్‌లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. అవి కూడా 48 గంటల ముందుగానే యాప్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.



చంద్రగిరి నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ నిషాంత్‌రెడ్డి

24/7 బృందాల పర్యవేక్షణ

ఎన్నికల నిబంధనలను చాలా మైక్రోలెవల్‌లో పరిశీలిస్తున్నాం. దీని కోసం 16 బృందాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఐదు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ), ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, మూడు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, మూడు వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు మొత్తం 16 టీమ్‌లు పనిచేస్తున్నాయి. ఈ బృందాలు 24/7 పనిచేస్తాయి.

ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించాం

కోడ్ అమలులోకి వచ్చిన 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నేతల ఫొటోలను తొలగించాం. 48 గంటల్లోగా బహిరంగ ప్రదేశాల్లో పార్టీల ఫ్లెక్సీలను తొలగించి నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశాం. మూడో రోజు అనుమతులు లేకుండా ప్రైవేటు ఆస్తులపై ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లను తొలగించాం.

ఇంటి నుంచే ఓటు

85 ఏళ్లు దాటిన వారితో పాటు దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసే సాకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. 85 ఏళ్లు పైబడ్డ ఓటర్లు చంద్రగిరి నియోజకవర్గంలో 964 మంది ఉన్నారు. దివ్యాంగులు 4,386 మంది ఉన్నారు. వారి వైకల్యం 40 శాతం దాటి ఉండి, ఆ విషయాన్ని ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. అప్పుడు బీఎల్వో వారి ఇంటి వద్దకు వెళ్లి నిజంగానే వారు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోలేరని ధ్రువీకరించాలి. అప్పుడే వారు ఇంటి నుంచి ఓటు వేసే సాకర్యాన్ని ఉపయోగించుకోగలుగుతారు.

395 పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలో మొత్తం 395 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలంలో అత్యధికంగా 189 కేంద్రాలు ఉన్నాయి. అలాగే చంద్రగిరిలో 58, పాకాల–54, రామచంద్రాపురం–40, ఎర్రావారిపాళెం–29, చిన్నగొట్టిగల్లు–25 ఉన్నాయి. గతంలో రామచంద్రాపురం మండలంలో ఆరు, పాకాల మండలంలో ఒకటి చొప్పున మొత్తం ఏడు పోలింగ్ కేంద్రాల్లో రీ–పోలింగ్ జరిగింది. ఈ సారి మరింత పక్కా ప్రణాళికతో చర్యలు చేపడుతున్నాం. అదనపు బలగాలతో పర్యవేక్షిస్తున్నాం.

సంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా



తిరుపతి 38వ డివిజన్ సింగాలగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి, మేయర్ శిరీష

- ప్రజలను నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు ఎజెండా
- తిరుపతిలో లక్ష ఓట్ల మెజారిటీతో అభినయ్, గురుమూర్తి గెలుపు ఖాయం
- 38, 39 వార్డుల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం : రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్దే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని, జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపాయని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. అయితే ప్రజలకు మాయ మాటలు చెప్పి నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు నైజం, ఎజెండా అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరుపతిలోని 38, 39 డివిజన్లలో మంగళవారం కార్పొరేటర్ నరేంద్ర, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కే. ఇమామ్, పుణీతమ్మ, బొగ్గుల వెంకటేష్ ఆధ్వర్యంలో ఆయన ఎంపీ మద్దిల గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నేతలు ఏ గడపకు వెళ్లినా హారతులు పట్టి, గజమాలలతో సత్కరిస్తూ, పూల వర్షం కురిపిస్తూ అపూర్వస్వాగతం పలికారు. తిరుపతి నగర ప్రజలు భూమన కుటుంబంపై కురిపిస్తున్న ఆత్మీయఅభిమానానికి ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. భూమన అభినయ్‌ని తమ ఇంటి బిడ్డగా భావించి గెలిపించుకుంటామని స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. గత 40 ఏళ్లల్లో ఎవ్వరికీ సాధ్యం కానివిధంగా తిరుపతిని అభివృద్ధి చేసిన అభినయ్‌ని కాకుండా మరొక నాయకుడిని ఎందుకు ఎన్నుకుంటామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్దే అజెండాగా భావించి ప్రతిపేదవాడికీ మరింతగా సంక్షేమం ఎలా అందించాలన్న తపన జగనన్నదైతే, ఓట్లు , సీట్ల కోసం ప్రజలకు ఎలాంటి మాయమాటలు చెప్పాలి, ఎలా నమ్మించి మోసగించాలని చూసే ప్రజాద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు. గత 14 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏ చిన్నపాటి మేలు చేయలేదు కాబట్టే ఈ ఎన్నికల్లో ఒక్కడిగా వచ్చి పోటీ చేసే దమ్ములేక జనసేన, బీజేపీలతో పొత్తులు పెట్టుకున్న ప్రజాద్రోహి చంద్రబాబు అన్నారు. ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా రాష్ట్ర ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారన్నారు. తిరుపతిలో రూ.1,700 కోట్లతో అభివృద్ధి చేయగలిగామంటే అది కేవలం జగనన్న సహకారం వల్లేనని స్పష్టం చేశారు. తిరుపతిలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన సుమారు 2లక్షల మంది వైఎస్సార్‌సీపీకే మద్దతుగా ఉన్నారన్నారు. రెండేళ్లల్లోనే తిరుపతి రూపురేఖలు మార్చేసిన తన కుమారుడు భూమన అభినయ్‌ని ఎమ్మెల్యేగా, మద్దిల గురుమూర్తిని ఎంపీగా ఆశీర్వదించి గెలిపిస్తే రానున్న ఐదేళ్లలో తిరుపతిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారని చెప్పారు. తిరుపతిలో నిర్మించిన 22 మాస్టర్‌ప్లాన్ రోడ్లలో వెళుతుంటే ఇతర దేశాల్లో వెళుతున్న ఆనందం కలుగుతోందన్నారు. తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతో, తిరుపతి ఎంపీగా మద్దిల గురుమూర్తి నాలుగన్నర లక్షల కోట్ల మెజారిటీతో గెలివడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, పాముల రమేష్‌రెడ్డి, కంకనాల రమేష్, పెరుగుబాబూయాదవ్, కార్పొరేటర్లు ఆరణి సంధ్య, శైలజ, దూదికుమారి, కో–ఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి, పార్టీ నాయకులు మస్తాన్, జయప్రద, రత్నమ్మ, శాంత, మాదవి, గంగామోహన్, సుబ్రమణ్యం, అరుణ్, డోలా, మునికృష్ణయాదవ్, నరసింహులు, మల్లారపు మధు, ప్రమీలమ్మ , ఈశ్వర్, దిలీప్ పాల్గొన్నారు.

నాడు వెనుకబడిన ప్రాంతం.. నేడు ఆర్థిక కేంద్రం

– శ్రీసిటీ ఆర్థిక పరివర్తన నమూనాపై మేనేజింగ్ డైరెక్టర్ వివరణ



ప్రసంగిస్తున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం.. నేడు ఆర్థిక కేంద్రంగా మారిందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్క్స్ (ఎన్‌సీఎస్ఐపీ) చైర్మన్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలో సెజ్ పాలసీలపై అంతర్జాతీయ దృక్పథం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సెజ్‌ల ప్రధాన సమస్యలపై అవగాహన కలిగిన నిపుణులు, విధాన రూపకర్తలు, అధికారులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు ఇందులో పాల్గొన్నారు. 'సెజ్‌లో దృక్పథం, మౌలిక సదుపాయాల వృద్ధి' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొని లోతైన విశ్లేషణలను తెలియజేశారు. శ్రీసిటీలో 29 దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తూ 220 పరిశ్రమలకు నిలయంగా మారిందన్నారు. శ్రీసిటీ ఏకీకృత విధానాన్ని వివరిస్తూ, ఎస్ఈజెడ్, డొమెస్టిక్ టారిఫ్ జోన్, ఫ్రీ ట్రేడ్ వేర్‌హౌసింగ్ జోన్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లతో కూడిన సమగ్ర పర్యావరణ వ్యవస్థను నెలకొనట్టు వివరించారు. సెజ్‌ల కేంద్ర మాజీ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ ఎల్‌బీ.సింఘాల్, ఇతర ప్రముఖులు శ్రీసిటీ ప్రత్యేకతలను ప్రశంసించారు.

సాదర స్వాగతం

రేణిగుంట: జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు ఘనస్వాగతం లభించింది. విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమరావు, తిరుపతి 3వ అదనపు జడ్జి ఎం.గుర్నాథ్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు.

29న ఉచిత పాలిసెట్ నమూనా పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో ఈనెల 29న ఉదయం 10గంటలకు పాలిసెట్ నమూనా పరీక్షను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 27వ తేదీన రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అనుగుణంగా నమూనా పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. నమూనా పరీక్ష అనంతరం పాలిటెక్నిక్‌లోని డిప్లొమో కోర్సులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నమూనా పరీక్ష, అవగాహన సదస్సుకు పాలిసెట్ పరీక్ష రాయనున్న విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘరానా మోసగాడు అరెస్ట్

తిరుపతి క్రైమ్: అమాయకులను మోసం చేస్తూ ఏటీఎం కార్డులను మార్చి దోచుకుంటున్న ఘరానా మోసగాడిని ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈస్ట్ పోలీసుల కథనం.. శ్రీకాళహస్తి మండలం, కందాడ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(38) లీలామహల్ సర్కిల్ సమీపంలో ఇటీవల ఓ ఏటీఎంలో వృద్ధురాలి వద్ద ఏటీఎం కార్డును మర్చేశాడు. ఆపై ఆమె అకౌంట్లో నుంచి విడతల వారీగా నగదు కాజేశాడు. ఆలస్యంగా తెలుసుకున్న వృద్ధురాలు ఈనెల 19న ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి నిందితున్ని అరెస్ట్ చేశారు. అతనిపై పుత్తూరు, శ్రీకాళహస్తి వన్‌టౌన్, వడమలపేట, గాజుల మండ్యం పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్టు గుర్తించారు. ఆపై అతని వద్ద నుంచి రూ.1.04 లక్షలు రికవరీ చేసినట్టు పోలీసులు తెలిపారు.

లక్కమనేని మధుకు నోటీసులు

శ్రీకాళహస్తి: ఎన్నికల నియమ, నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు వాడిన టీడీపీకి చెందిన లక్కమనేని మధుపై కేసు నమోదు చేసినట్టు 1వ పట్టణ పోలీసులు తెలిపారు. ఆదివారం టీడీపీ చేపట్టిన ర్యాలీకి అనుమతి తీసుకన్న దానికన్నా అదనపు వాహనాలు వాడడం, నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా కాల్చడంపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని కండువాలతో ఆహ్వానిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట: వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు వస్తున్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో తెలుగుదేశం పార్టీ నుంచి ఊళ్లకు ఊళ్లే చేరిపోతున్నాయి. మంగళవారం చిన్నగొట్టిగల్లు పంచాయతీ టీ కుమ్మరపల్లెకు చెందిన టీడీపీ కుటుంబాలు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ తమను నమ్మి వచ్చిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కులం, మతం, వర్గం, భేదం, ప్రాంతం అనే తేడా లేకుండా పాలన సాగిస్తూ, సంక్షేమాన్ని అందిస్తున్నట్టు వెల్లడించారు. టీ కుమ్మరపల్లెలో టీడీపీ పుట్టుక నుంచి ఉన్న మద్దుశెట్టి శంకర్, అసనాపురం రెడ్డెప్ప, కరీముల్లా, భాస్కర్, ఇమాంవల్లీ, నరేష్, రెడ్డెప్ప వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా తమకు సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. చదువులకు అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, విద్యాకానుక అందించి తమ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. నవరత్నాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అక్బర్, సర్పంచ్ మనోహర్, ఖదీర్‌అహ్మద్, భాస్కర్‌రెడ్డి, రియాజ్, అన్వర్‌బాషా, ఇస్మాయిల్, బావాజీ, విజయ్, రాజేష్, ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

24 గంటల్లో హ్యాండ్ బోర్ల మరమ్మతులు



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: 'తాగునీటి సమస్యలపై నిర్వహిస్తున్న సమావేశం ఎంతో ముఖ్యమైనది. అయినప్పటికీ కొందరు అధికారులు హాజరు కాలేదు. వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వండి' అని కలెక్టర్ జీ.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీటికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరుకాని వాకాడు, తొట్టంబేడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సురేష్‌చౌదరి, సుబ్రమణ్యంకు షోకాజ్ నోటీసులు అందజేశారు. వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులు అందిన 48 గంటల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. హ్యాండ్ పంపులైతే 24 గంటల్లోనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీతోపాటు మండలాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధిహామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నీటి సరఫరా సమస్యలపై జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పట్టణాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లు పూర్తిగా నింపేలా, మల్టీ విలేజ్, హ్యాబిటేషన్ డిస్ట్రిబ్యూషన్ సీపీడబ్ల్యూ స్కీమ్స్‌ను నింపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జూన్ 31 వరకు చేపట్టాల్సిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా చంద్రగిరి, తొట్టంబేడు, వాకాడు, శ్రీకాళహస్తి, తిరుపతి రూరల్, వరదయ్యపాళెం, చిన్న గొట్టిగల్లు తదితర ప్రాంతాల్లో ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించాలని చెప్పారు. జిల్లా తాగునీటి సరఫరా అధికారి విజయ్‌కుమార్, పథక సంచాలకులు, డ్వామా శ్రీనివాసరా వు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం ముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హ్రిషికేష్ రాయ్

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హ్రిషికేష్ రాయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభ వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ఎట్టెట్టా?

డిపాజిట్ దక్కలేదంటే..!

ఎన్నికల్లో పోటీ చేసే నాయకులకు డిపాజిట్ దక్కాలేదంటే ఆ అవమానం భరించలేనిది. మరి ఇంతకీ డిపాజిట్ దక్కడమంటే ఏమిటంటే.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో జనరల్ కేటగిరీ వారైతే రూ.10 వేలు, రిజర్వేషన్ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్‌గా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద చెల్లించాల్సి ఉంటుంది. సదరు అభ్యర్థికి తాను పోటీ చేసిన నియోజకవర్గంలో పోలైన చెల్లిన ఓట్లలో 6 శాతం ఓట్లు రావాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక నియోజకవర్గంలో లక్ష చెల్లిన ఓట్లు పోలైతే 6వేలు ఓట్లు వస్తే డిపాజిట్ దక్కినట్లుగా నిర్ధారిస్తారు. అంతకు ఒక్క ఓటు తగ్గినా డిపాజిట్ గల్లంతు అయినట్లు లెక్క. డిపాజిట్ దక్కని పక్షంలో నామినేషన్ దాఖలు చేసిన సమయంలో ఎన్నికల అధికారి వద్ద డిపాజిట్ చేసిన ధరావత్తు సొమ్మును అధికారులు జప్తు చేస్తారు. డిపాజిట్ దక్కించుకున్న వారికి ఎన్నికల తర్వాత గెజిట్ పబ్లికేషన్ పూర్తికాగానే డిపాజిట్ నగదును సదరు అభ్యర్థికి తిరిగి చెల్లిస్తారు.

– తిరుపతి సిటీ